E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు

AUG 23

## తెలుసుకుందాం !

### ఆగస్టు 23: చరిత్రలో ఈరోజు

1927: నికోలా సాకో మరియు బార్టోలోమియో వాంజెట్టి అనే ఇద్దరు కార్మికులను ఉరితీశారు.

1872: ఆంధ్ర రాష్టానికి మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జననం.

1900: కవి, పండితుడు మరియు గ్రంథ రచయిత మద్దులపల్లి వేంకట సుబ్రహ్మణ్యశర్మ జననం.

1918: భారతీయ భౌతిక శాస్త్రవేత్త అన్నా మణి జననం.

శనివారం తెలుగు గళం 23 ఆగస్టు తెలంగాణ - ఆంధ్రప్రదేశ్

## ట్రంప్ టారిఫ్ ఒత్తిడికి తలొగ్గేది లేదు



కొలంబో : శ్రీలంక మాజీ అధ్యక్షుడు మరియు ఆరుసార్లు ప్రధానిగా బాధ్యతలు నిర్వహించిన రణిల్ విక్రమ్ సింఘేను పోలీసులు అరెస్ట్ చేశారు. అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ప్రైవేట్ పర్యటనలో భాగంగా విదేశాలకు వెళ్లేందుకు దేశ నిధులను వినియోగించారన్న అభియోగంపై ఆయనను అదుపులోకి తీసుకున్నారు. "శుక్రవారం ఉదయం విక్రమ్ సింఘేను శ్రీలంక సిఐడి అదుపులోకి తీసుకుంది. 2023 సెప్టెంబర్‌లో లండన్ పర్యటనకు సంబంధించి ఆయనను విచారించారు" అని ఒక సీనియర్ అధికారి తెలిపారు. ఈరోజు కొలంబో ఫోర్ట్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచనున్నట్లు ఆయన తెలిపారు. ఆర్థిక సంక్షోభం కారణంగా చెలరేగిన దేశవ్యాప్త నిరసనల తర్వాత మాజీ అధ్యక్షుడు గోటబయ రాజపక్సే పదవి నుండి వైదొలిగిన సంగతి తెలిసిందే. అనంతరం 2022 జులైలో జరిగిన అత్యవసర పార్లమెంటరీ ఓటింగ్‌లో విక్రమ్ సింఘే అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

## డ్రేక్ పాసేజ్‌లో భారీ భూకంపం




చిలీ : చిలీ సమీపంలోని డ్రీక్ పాసేజ్‌లో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్ పై దీని తీవ్రత 7.5గా నమోదైనట్లు యూఎస్ జియాలజికల్ సర్వే వెల్లడించింది. పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం చిలీకి సునామీ హెచ్చరికలను జారీ చేసింది. భూకంప కేంద్రం 10.8 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

## అసెంబ్లీ ఎన్నికల్లో చరిత్ర సృష్టిస్తాం

- టివికె అధ్యక్షులు, నటుడు విజయ్



చెన్నై : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ సరికొత్త చరిత్ర సృష్టిస్తుందని తమిళగ వెట్రి కళగం(టివికె) అధ్యక్షులు, నటుడు దళపతి విజయ్ ధీమా వ్యక్తం చేశారు. తమ భావజాల శత్రువు బిజెపి, రాజకీయ విరోధి డిఎంకె అని, ఆ పార్టీలతో ఎటువంటి పొత్తు ఉండదని ఆయన ప్రకటించారు. టివికె రాష్ట్ర రెండో సమావేశం మదురైలో గురువారం జరిగింది. టివికె ఒంటరిగా నిలబడుతుందని, ఎవరికీ భయపడదని పేర్కొన్నారు. 2026 తమిళనాడు రాజకీయాల్లో తమ పార్టీ, డిఎంకె మధ్యే పోటీ ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. 1967, 1977లో తమిళనాడు రాజకీయాల్లో జరిగిన చారిత్రక మార్పులను గుర్తు చేస్తూ, 2026లో అలాంటి మరో మార్పునకు తాను నాయకత్వం వహిస్తానని ధీమా వ్యక్తం చేశారు. 'నేను రాజకీయాల్లోకి రానన్నారు, ఓట్లు వేయరన్నారు. కానీ నేను తమిళనాడు గుండె చప్పుడు మాత్రమే వింటాను.. మిగతా విమర్శలను చూసి నవ్వుతాను..' అంటూ విమర్శకులకు కౌంటర్ ఇచ్చారు.తమిళ జాలర్ల సమస్యలు, కచ్చతీవు తిరిగి తీసుకోవాలనే డిమాండ్, నీట్ రద్దు చేయాలనే అంశాలను ప్రస్తావించారు. ఈ సమస్యలను పరిష్కరించడానికి టివికె గట్టిగా పోరాడుతుందని హామీ ఇచ్చారు.

## 5.5కోట్ల మంది వీసాలను సమీక్షిస్తోన్న ట్రంప్ యంత్రాంగం




వాషింగ్టన్ : అమెరికాలో విదేశీయులపై వేటు వేసేందుకు ట్రంప్ యంత్రాంగం సిద్ధమైంది. అమెరికాలో చెల్లుబాటు అయ్యే సుమారు 5.5కోట్ల మంది వీసాలను బహిష్కరణ నేరాల కోసం పరిశీలిస్తున్నామని ట్రంప్ యంత్రాంగం గురువారం తెలిపింది. వీసా నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన వారిని దేశం నుండి బహిష్కరించనున్నట్లు పేర్కొంది. పలు దేశాలకు చెందిన పర్యాటకులు సహా యుఎస్ వీసా కలిగిన వారందరూ 'నిరంతరం పర్యవేక్షణ'కు లోబడి ఉంటారని, వారు అమెరికాలోకి ప్రవేశించడానికి లేదా నివసించేందుకు అనుమతి పొందేందుకు అర్హులనే సంకేతాలను దృష్టిలో ఉంచుకుని ఉంటారని స్టేట్ డిపార్ట్‌మెంట్ మీడియా ప్రశ్నకు ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానంలో తెలిపింది.

నేర కార్యకలాపాలు, ప్రజా భద్రతకు ముప్పు, ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొనడం, లేదా ఉగ్రవాద సంస్థకు మద్దతు ఇవ్వడం వంటి సమాచారం వెల్లడైతే.. ఆ వ్యక్తులపై అనర్హత వేటు వేయనున్నట్లు ఆ విభాగం తెలిపింది. అటువంటి సమాచారం దొరికితే వీసా రద్దు చేయబడుతుందని, వారు అమెరికాలోనే ఉంటే బహిష్కరణకు గురవుతారని పేర్కొంది. వారిపై విస్తృత పర్యవేక్షణ ఉంటుందని, అమెరికాలో ఉండేందుకు అనుమతి పొందిన వారిని సైతం అకస్మాత్తుగా దేశం నుండి బహిష్కరించవచ్చని విదేశాంగ సూచించింది. తమ పరిశీలనలో భాగంగా అందుబాటులో ఉన్న సమాచారాన్నంతటినీ సమీక్షిస్తామని,

మిగతాది 3వ పేజీలో

## ముంగేర్ నుంచి తిరిగి ప్రారంభమైన 'ఓటర్ అధికార్ యాత్ర'



ఎ పాట్నా : లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, బీహార్ అసెంబ్లీ ప్రతిపక్షనేత తేజస్వియాదవ్ చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర' నేడు ముంగేర్ నుంచి తిరిగి ప్రారంభమైంది. ఈ యాత్రలో భాగంగా.. చందన్ బాగ్ చౌక్‌లో బజరంగ్‌బలి ఆలయంలో హనుమాన్‌జీకి వారిద్దరూ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అలాగే ఆరో రోజుకి చేరుకున్న ఈ యాత్ర నేడు సుల్తాన్‌గంజ్ చౌక్, అక్బర్ నగర్‌లోని ఖరాహియా ఇంటర్ స్కూల్ మైదానంలో జరగనున్న సభతో ముగియనుంది. ఈరోజు నాలుగు గంటలకు నథాన్‌గర్‌లో జరగనున్న బహిరంగ సభకు రాహుల్‌గాంధీ ప్రసంగించనున్నారు.కాగా, ఓటర్ అధికార్ యాత్ర 21వ తేదీన వాయిదావడింది. ఉపరాష్ట్రపతి నామినేషన్ దాఖలు వేసే కార్యక్రమం సందర్భంగా రాహుల్ ఈ యాత్రలో పాల్గొనలేదు. ఈ యాత్ర సందర్భంగా రాహుల్‌గాంధీ, తేజస్వియాదవ్‌లు ఎన్నికల సంఘంపైనా, నితీష్‌కుమార్ ప్రభుత్వంపైనా, ఎస్ఐఆర్ ప్రక్రియపైనా తీవ్ర విమర్శలు చేశారు.

ఓట్లను తారుమారుచేయడంపైనే బిజెపి ఎన్నికల విజయం దాగి ఉంది. దేశంలో కీలకమైన మార్పు జరగాలని చూసిన ప్రతిసారీ బిజెపి గెలుస్తుంది. మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో బిజెపి గెలవడానికి ప్రధాన కారణం ఓట్ల చోరీనే. ఇప్పుడు అదే పద్ధతిని బీహార్‌లో పునరావృతం చేసేందుకు బిజెపిప్రయత్నిస్తోంది అని రాహుల్ ఆరోపించారు. ఈ ఓటర్ అధికార్ యాత్ర బిజెపి, ఎన్నికల సంఘం చేస్తున్న అవకతవకల్ని బయటపెట్టడానికి చేపట్టిన యాత్ర అని రాహుల్ అన్నారు. బీహార్‌లో బిజెపి ట్రిక్స్ పనిచేయవు అని రాహుల్ వ్యాఖ్యానించారు.

బిజెపి, నితీష్‌కుమార్ ఓటమి పాలైనప్పుడల్లా ఎన్నికలను తారుమారు చేస్తారని తేజస్వియాదవ్ ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రధాని మోడీ బీహార్‌కు రానున్నారు. ఆయన ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పరిపాలనలో ఏం చేశారు? అనేదానిపై ఈ 11 సంవత్సరాల పాలనకు సంబంధించిన రిపోర్టు ఇవ్వాలి. దాదాపు ప్రతి ఎన్నికలోనూ బిజెపి ఓడిపోయే అవకాశం ఉంది. కానీ వారు ట్రిక్స్ ప్లే చేసి గెలుస్తున్నారు. ఈ ఎన్నికల్లో కూడా బీహార్ ప్రజలను మోసం చేయగలనని ప్రధాని భావిస్తున్నారు' అని తేజస్వియాదవ్ అన్నారు.

బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ నిద్రలో ఉన్నారు. ఎందుకంటే.. రాష్ట్రంలోని ప్రజా సమస్యలకు ఆయనకు పట్టడం లేదు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి దిగజారింది. హత్యలు, అత్యాచారాలు, దొంగతనాలు, దోపిడీలు రాష్ట్రంలో నిత్యకృత్యమయ్యాయి. నిరుద్యోగం, వలసలు నివారించడంలో, సరైన విద్య అందించడంలో నితీష్‌కుమార్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. డబుల్ ఇంజన్ సర్కార్ ప్రతి విషయంలోనూ విఫలమైంది. అందరూ ఐక్యంగా ఉండి.. ఈ ప్రభుత్వాన్ని కూలదోయండి అని ప్రజలకు తేజస్వి కోరారు.

## కేసీఆర్ పిటిషన్.. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమన్న హైకోర్టు



తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు కీలక విచారణ జరిపింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను రద్దు చేయాలని కోరుతూ వీరు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. అయితే, ఈ పిటిషన్లపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. కేసు యొక్క పూర్తి వివరాలను పరిశీలించిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. దీనికి సంబంధించిన పూర్తి కౌంటర్ దాఖలు చేయాలని అడ్వకేట్ జనరల్ (ఏజీ)ని ఆదేశించింది.ప్రభుత్వ వైఖరి, తదుపరి విచారణ

ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన అడ్వకేట్ జనరల్, పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చించిన తర్వాతే ముందుకు వెళ్తామని హైకోర్టుకు తెలిపారు. ఈ ప్రకటనను హైకోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఈ కేసుపై తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈలోగా ప్రభుత్వం తమ కౌంటర్ ను పూర్తి స్థాయిలో సమర్పించాలని ఆదేశించింది. ఇది కేసు యొక్క తదుపరి గమనాన్ని నిర్ణయించనుంది.

## ఆగస్ట్ 25 వరకు యథాతథ స్థితిని కొనసాగించండి : సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : సంభాల్ మసీదు వివాదంలో ఆగస్ట్ 25 వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. హిందూ పిటిషనర్లకు నోటీసులు జారీ చేసింది. జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీ చేశారు. షాహి జామా మసీదు మరియు హరిహర్ ఆలయ వివాదంలో సంభాల్ కోర్టు ఆదేశించిన సర్వేకు వ్యతిరేకంగా తన పిటిషన్‌ను కొట్టివేసిన అలహాబాద్ హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ మసీదు కమిటీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. మొఘల్ కాలం నాటి మసీదు సర్వేను ఆదేశించిన సివిల్ జడ్జి గతేడాది నవంబర్ 19న ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ మసీదు కమిటీ హైకోర్టును ఆశ్రయించింది. అదే రోజున సర్వే జరిగింది. గతేడాది నవంబర్ 24న నిర్వహించిన రెండవ సర్వే చట్టవిరుద్ధమని, సివిల్ కోర్టు ఎప్పుడూ ఆదేశించలేదని కమిటీ పేర్కొంది.

## ఆ చట్టం ఆమోదం పొందితే.. పిఎం, సిఎం అయినా పదవిని కోల్పోవాల్సిందే



గయా : త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ శుక్రవారం బీహార్ పర్యటనకు వెళ్లారు. ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం కింద కట్టిన ఇళ్లకు నేడు గృహ ప్రవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గయాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ పథకం కింద 12 వేల మంది లబ్ధిదారులు, అర్బన్ పథకం కింద 4వేల మంది లబ్ధిదారులు ఉన్నారు అని ఆయన అన్నారు. బీహార్ చాణక్యుడు, చంద్రగుప్తుడు.. ఏలిన ప్రదేశం అని కీర్తించారు. అన్ని సమయాల్లోనూ దేశానికి వెన్నుముకగా బీహార్ నిలిచిందన్నారు. ఇక్కడ తీసుకున్న దీక్షలు ఈ దేశాన్ని బలోపేతం చేశాయి. వృధా కాలేదన్నారు. పెహల్గామ్ ఉగ్రదాడి జరిగిన సమయంలో ఉగ్రవాదులను అణిచివేస్తామని ఇక్కడ నుంచే పేర్కొన్నట్లు చెప్పారు. అనుకున్నట్టుగానే ప్రభుత్వం అనుకున్న లక్ష్యం నెరవేరిందని.. దాన్ని ప్రపంచం కూడా ప్రత్యక్షంగా చూసిందన్నారు.

ఈ సభలో మోడీ ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లును ఉద్దేశిస్తూ వ్యాఖ్యలు చేశారు. 'ప్రభుత్వ ఉద్యోగిని 50 గంటల పాటు జైలులో వేస్తే, అప్పుడు ఆ వ్యక్తి తన ఉద్యోగాన్ని కోల్పోతున్నాడు. అతను ఓ డ్రైవర్ అయినా, క్లర్క్ అయినా, ప్యూన్ అయినా .. జాబ్ పోతోంది. కానీ సిఎం, మంత్రులు.. జైలులోనే ఉంటూ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారు. గతంలో కొందరు జైలు నుంచే ఫైళ్లపై సంతకాలు చేసేవారు. జైలు నుంచే ప్రభుత్వ ఆదేశాలు ఇచ్చేవారు. ఒక ప్రజానేతకు అటువంటి వ్యక్తిత్వం ఉంటే, అప్పుడు మనం అవినీతిని ఎలా ఎదుర్కుంటామని ప్రధాని ప్రశ్నించారు. అవినీతికి వ్యతిరేకంగా ఎన్‌డిఎ ప్రభుత్వం చట్టాన్ని తయారు చేసింది. ఆ చట్ట పరిధిలోకి ప్రధానమంత్రి కూడా వస్తారు. ఒకవేళ ఆ చట్టం ఆమోదం పొందితే, అప్పుడు జైలులో ఉన్న ప్రధాని అయినా, సిఎం అయినా.. 31వ రోజు తన పదవిని కోల్పోవాల్సిందే' అని అన్నారు.

ఆర్‌జెడి పాలన సమయంలో గయాజీ లాంటి పట్టణాలు చీకట్లోకి వెళ్లినట్లు మోడీ ఆరోపించారు. ఎన్నో తరాల నుంచి ప్రజలు ఇక్కడ నుంచి వలస వెళ్లినట్లు చెప్పారు. బీహారీ ప్రజలను ఆర్‌జెడి కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తోందన్నారు. రాష్ట్ర ప్రజల జీవితాలు, బాధలు, గౌరవమర్యాదల గురించి ప్రతిపక్షాలు ఆలోచించడం లేదన్నారు. బీహార్ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ఎన్‌డిఎ సర్కారు తీవ్రంగా ప్రయత్నిస్తోందని మోడీ చెప్పారు.

## ప్రతి ఏటా టీచర్ పోస్టుల భర్తీ

- సమర్థవంతంగా సంస్కరణలు అమలు
- తల్లికి వందనం చివరి దశ నిధుల విడుదల
- సమీక్షలో మంత్రి లోకేష్



అమరావతి బ్యూరో : ప్రతిఏటా డిఎస్సి ప్రకటించి ఖాళీలను భర్తీ చేస్తామని విద్య,ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. రాష్ట్రచరిత్రలో తొలిసారిగా 16,347 పోస్టులతో మెగా డిఎస్సి ప్రకటించి విజయవంతంగా నిర్వహించామని చెప్పారు. ఉండవల్లిలోని తన నివాసంలో విద్యాశాఖపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ విద్యలో విద్యప్రమాణాలను మెరుగుపర్చేందుకు 14 నెలలుగా సమర్థవంతంగా సంస్కరణలు అమలు చేశామని తెలిపారు. సంస్కరణల అంతిమ లక్ష్యం అభ్యసన ఫలితాలే అని, మెరుగైన ఫలితాలపై దృష్టిసారించాల్సిన బాధ్యత అధికారులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. దేశంలో తొలిసారిగా ప్రతి బిడ్డకు గ్యారెంటీడ్ ఎఫ్ఎల్ఎన్ ఒక హక్కుగా ఉపాధ్యాయుల సహకారంతో ఇవ్వబోతున్నామని తెలిపారు. అనవసరమైన శిక్షణా కార్యక్రమాలతో ఉపాధ్యాయుల విలువైన సమయాన్ని వృద్ధా చేయొద్దని సూచించారు. తల్లికి వందనం చివరి విడత పెండింగ్ దరఖాస్తులను ఆమోదిస్తూ రూ.325కోట్లు విడుదల చేశామని తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా 2024-25 ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్తగా మంజూరైన జవహర్ నవోదయ విద్యాలయాలు, కేంద్రీయ విద్యాలయాలకు దాతల సహకారంతో భూసేకరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉత్తమమైన ప్రీస్కూల్ పాలసీ కోసం ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని చెప్పారు

మిగతాది 3వ పేజీలో

## 5.5కోట్ల మంది వీసాలను సమీక్షిస్తోన్నట్రంప్ యంత్రాంగం




చట్ట అమలు లేదా ఇమ్మిగ్రేషన్ రికార్డులు లేదా వీసా జారీ అనంతరం వెలుగులోకి వచ్చిన ఇతర సమాచారాన్ని అనర్హత కోసం వినియోగించవచ్చని తెలిపింది. వాణిజ్య ట్రక్ డ్రైవర్లకు వర్కర్ వీసాలు జారీ చేయడం కూడా అమెరికా నిలిపివేస్తుందని విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో గురువారం తెలిపారు. ఈ మార్పు వెంటనే అమల్లోకి వస్తుందని అన్నారు. అయితే అమెరికాలో ఎంతమంది విదేశీ ట్రక్ డ్రైవర్లు ఉన్నారన్న ప్రశ్నకు ఆ విభాగం స్పందించలేదు.

## తల్లికి వందనం చివరి దశ నిధుల విడుదల



నిర్ణీత క్యాలెండర్ ప్రకారం మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో సైన్స్ అండ్ స్పోర్ట్స్ ఫేర్‌లు నిర్వహణకు శాప్ సహకారం తీసుకోవాలని తెలిపారు. రాజ్యాంగ దినోత్సవం నాడు అసెంబ్లీలో విద్యార్థులతో ప్రత్యేక సమావేశం నిర్వహించడానికి స్పీకర్ అనుమతితో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి విద్యార్థులను ఎంపిక చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూళ్లలో కీలకమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి దేశ, విదేశాల్లో స్థిరపడిన ప్రముఖులు, దాతల సహకారం తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ, మోడల్ స్కూళ్లల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి దేశ, విదేశాల్లో స్థిరపడిన దాతలు, కార్పొరేట్ సంస్థల సహకారం తీసుకోవాలని తెలిపారు. దేశంలోనే అత్యుత్తమ మోడల్‌తో అమరావతిలో 2లక్షల చదరపు అడుగుల్లో సెంట్రల్ లైబ్రరీ నిర్మాణాన్ని ఏడాదిలోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విశాఖపట్నం జగదాంబ సెంట్రల్‌లో ప్రతిపాదించిన రీజనల్ లైబ్రరీని 50వేల అడుగుల్లో నిర్మించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలతో పాటు కొత్తగా ఏర్పాటైన జిల్లా కేంద్రాల్లో జిల్లా గ్రంథాలయాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. స్థానిక సంస్థల నుంచి సుమారు రూ.213కోట్ల మేర సెస్సు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని రాబట్టి లైబ్రరీలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ విజయరామరాజు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ కృతికా శుక్లా, సమగ్ర శిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు, విద్య,మౌలిక సదుపాయాల సంస్థ ఎండి సిఎన్ దీవెన్ రెడ్డి, పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్ కృష్ణమోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎంటిపి కిట్ల అక్రమ విక్రయాలపై దాడులు

### వరంగల్,హన్మకొండలో డ్రగ్ ఇన్స్పెక్టర్ చర్యలు



తెలుగు గళం న్యూస్ వరంగల్

డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాన్ సర్ మరియు అసిస్టెంట్ డైరెక్టర్ మేడమ్ ఆదేశాల మేరకు,డ్రగ్ ఇన్స్పెక్టర్ జె.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వరంగల్ మరియు హన్మకొండ జిల్లాల్లోని అనేక మెడికల్ షాపులపై దాడులు నిర్వహించారు.తనిఖీల సమయంలో ఎంటిపి కిట్ల(అబార్టిఫేషియంట్ టాబ్లెట్ల)అనధికార విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించారు.ముఖ్యంగా వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మకం,హెచ్%డ%హెచ్1 షెడ్యూల్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించకపోవడం,ఈ ఉల్లంఘనలపై సంబంధిత మెడికల్ షాపులపై కేసులు నమోదు చేశారు.డ్రగ్ ఇన్స్పెక్టర్ హెచ్చరిక జారీ చేస్తూ,ఎంటిపి కిట్ల విక్రయంలో డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం,1940 మరియు నియమాలు,1945ను ఉల్లంఘించే ఫార్మసీలపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.






## ఆగస్టు 31 లోపల స్పోర్ట్స్ స్కూల్ పనులు పూర్తి చేయాలి-కడియం శ్రీహరి

- సెప్టెంబర్ మొదటి వారంలో స్పోర్ట్స్ స్కూల్ ప్రారంభోత్సవం
- విద్యార్థులకు అసౌకర్యం లేకుండా అన్ని వసతులు కల్పించాలని ఆదేశం
- రాష్ట్రంలోనే బెస్ట్ స్పోర్ట్స్ స్కూల్ గా అభివృద్ధి చేయాలన్న సంకల్పం



**తెలుగు గళం న్యూస్ హన్మకొండ**

హనుమకొండ జేఎన్ఎస్ లో తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ కం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పనులను ఆగస్టు 31లోగా పూర్తి చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి,స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులు ఆదేశించారు. శుక్రవారం కుడా కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కుడా ఛైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి,ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి,కేఆర్ నాగరాజు,కలెక్టర్ స్నేహ శబరీష్,జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్పోర్ట్స్ స్కూల్ సౌకర్యాలపై దృష్టి,తాగునీటి సౌకర్యం,టాయిలెట్స్,విద్యార్థుల వసతి,భవనాలకు రంగులు,లైటింగ్ ఏర్పాట్లు,ఇతర నగరాల స్పోర్ట్స్ స్కూల్స్ సందర్శించి పరిశీలించాలన్నారు. ధర్మసాగర్ మండలం ఉనికిచర్లలోని 22 ఎకరాలు క్రికెట్ స్టేడియం నిర్మాణానికి అనువైన స్థలం అని గుర్తించిన ఎమ్మెల్యే,స్థల సేకరణలో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించాలని కలెక్టర్,మున్సిపల్ కమిషనర్,కుడా అధికారులను ఆదేశించారు.దేవునూరు గుట్టలను ఎకో టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ ప్రతిపాదనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.సమీక్షా సమావేశంలో హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి,జిల్లా యువజన క్రీడాధికారి అశోక్ కుమార్,కుడా పీవో అజిత్ రెడ్డి,ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సామూహికంగా బహిష్కరించడం అత్యంత అన్యాయం

**తెలుగు గళం న్యూస్**

దళితుడు కులాంతర వివాహం చేసుకున్నాడని కారణంగా సామూహికంగా బహిష్కరించడం అత్యంత అన్యాయం అని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు నాగార్జున తీవ్రంగా ఖండించారు.

చిట్యాల మండల కేంద్రంలో ఒక దళిత యువకుడు బీసీ యాదవ కులానికి చెందిన యువతిని వివాహం చేసుకున్నారనే కారణంతో, యాదవులంతా కలిసి గ్రామ సభ పెట్టి దళితులను దప్పు కొట్టడానికి మరియు కూలీకి పిలవకూడదని, డ్రైవర్లుగా తీసుకోకూడదని తీర్మానం చేసి కాగితం రాసి సంతకాలు చేయడం బహిరంగంగా బహిరంగపరచడం సామూహికంగా బహిష్కరించడం దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఘోరమైన చర్య అని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా చిట్యాల పోలీస్ స్టేషన్లో




ఫిర్యాదు చేసిన అనంతరం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. నాగార్జున మాట్లాడుతూ:

స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏళ్లకు పైగా గడిచినా కుల వివక్ష కొనసాగడం సిగ్గుచేటు. గత పది రోజులుగా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దౌర్భాగ్యం. ప్రస్తుతం చిట్యాలలో అలజడి వాతావరణం నెలకొందిబీ దళితులు ప్రాణభయంతో ఉన్నారు.దళిత యువకులపై దాడులు చేసి తీవ్రంగా గాయపరిచారని, తలలు పగలగొట్టారు, తీవ్రంగా దౌర్జన్యం జరిగిందని తెలిపారు.

దళితులపై జరిగిన ఈ దౌర్జన్యం, అవమానం, సామూహిక బహిష్కరణపై బాధ్యులైన వారిపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని చిట్యాల ఎస్ఐకి వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో %ఖపూూ% జిల్లా సహాయ కార్యదర్శి ఒంటెపాక కృష్ణ, చిట్యాల మండల కార్యదర్శి బొడ్డు బాబురావు, ఎల్లేష్, జిట్ట మల్లేష్, వెంకటేశ్వర్లు, రమేషు, వెంకన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా తీజ్ నవరాత్రుల ఉత్సవాలు

### 24న ముగింపు నిమర్జనం సందర్భంగా బంజారా నృత్యాలతో ర్యాలీ

**తెలుగు గళం న్యూస్**

బాలాజీ నగర్ జనగామ:

జనగామ పట్టణంలోని బాలాజీ నగర్ ఏరియాలో లంబాడి జాతి కుల పెద్దలు ధరావత్ సోమ్లు నాయక్ ఇంటి వద్ద లంబాడీ గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిబింబించే తేజ్ పండుగ నవరాత్రి ఉత్సవాలను బంజారా కుల యువతులు మహిళలు కుల పెద్దలు ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుంది

ఈ సందర్భంగా జాతి పెద్దలు మూడ్ లక్ష్మణ్ నాయక్ , ధరావత్ సోమ్లు నాయక్ మాట్లాడుతూ.....

ఈ తీజ్ పండుగను తొమ్మిది రోజులు ఘనంగా లంబాడి బంజారా సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిభవించే విధంగా ప్రస్తుత ఆధునిక సమాజంలో బంజారా సంస్కృతిని యుతకు తెలిసేవిధంగా శ్రావణమాసము లో వచ్చే రాఖీపూర్ణిమ రోజు ప్రారంభమై గోకులాష్టమి రోజున ముగుస్తుంది. పెళ్ళికాని అమ్మాయిలు అందరు పాటలు పాడుతూ, నాట్యం చేస్తూ ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. వెదురు బుట్టల్లోనే కాకుండా "మోదుగు" ఆకులతో గుల్లగా చేసి అందులో మట్టిని పోసి, గోదుమలని చల్లుతారు. పెళ్ళికాని ఆడ పిల్లలు ప్రతిరోజు మూడు పూటలు అందంగా ముస్తాబై వెదురు బుట్టల్లో ఉన్న గోదుమలకు నీల్లు జల్లుతారు. ఐతే ఈ కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లలు "పులియాగెణో" పూర్ణకుంభం తలపై పెట్టుకొని బావి నీళ్లుకాని, బోరింగ్ నీళు ళ్ళకాని, చెరువు నీళ్లుకాని, తీసుకు వచ్చి తీజ్ కి పోస్తారు. ఈ కార్యక్రమం జరిగేటప్పుడు పెళ్ళికాని మగపిల్లలు తీజ్ కి నీళ్ళ పోయ్యనివ్వకుండా ఆపి కొన్ని



పొడుపు కథలు వేస్తారు. వాటికి సమాధానం చెప్పినవారికి తీజ్ కి నీళు ళ్ళ పొయ్యనిస్తారు. ఈ విధంగా రోజుకు మూడు పూటల పాటలు పాడుతూ, నృత్యాలు నృత్యం చేస్తూ నీళ్ళు జల్లుతూ, అగరు బత్తులతో దూపం చేస్తూ నైవేద్యం పెడుతూ ఆనందంగా ఈ పండుగను నిర్వహించుకుంటారు.

ఈ సందర్భంగా చివరి రోజునా గణగౌర్, డంభొలి, డొక్రి, డొక్ర వంటి ఆనేక కార్యక్రమాలు నిర్వహించి 9 వరోజున ఆదివారం నాడు నిమర్జనం సందర్భంగా జనగామ పట్టణంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో బంజారా యువతులు మహిళలు నాయకులుగుగులోతు లక్ష్మణ్ నాయక్ (ఆడిట్) భూక్య వాసు నాయక్ భానోత్ హరిలాల్ నాయక్ లాకావత్ నరేష్ నాయక్ ధారావత్ సోమ్లా నాయక్ ధరావత్ ఖీమా నాయక్ భూక్య కోట నాయక్ గుగులోతు దేవ సింగ్ నాయక్ భూక్య శ్రీనివాస్ నాయక్ ధరావత్ గోపి కిషన్ నాయక్ బానోతు పాండు నాయక్ డి. దళ్ సింగ్ నాయక్ లకావత్ సోమేశ్వర్ నాయక్ గుగులోతు నరసింహ నాయక్ భూక్య చందు నాయక్ బానోతు జితేందర్ నాయక్ ప్రియాంక బాయి కొర్రా రాజేందర్ నాయక్ మాలోత్ బిక్కు సుగుణ నాయక్ జాటోత్ మోహన్ నాయక్ భూక్య రాజన్న నాయక్ డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్ గుగులోత్ లచ్చిరాం నాయక్ భూక్య శివరాం నాయక్ ధరావత్ రాజు నాయక్ లకవత్ శ్రీనివాస్ నాయక్ భూక్య కృష్ణ నాయక్ డా. భానోత్ శంకర్ నాయక్ లకవత్ రాములు నాయక్ (ఎక్సైజ్) డా. రఘు నాయక్ బానోత్ శంకర్ నాయక్ పి. రాజు నాయక్ గుగులోతు ప్రశాంత్ నాయక్ లకావత్ ప్రవీణ్ నాయక్ %దీ%. జవహర్ నాయక్ %+%. భాస్కర్ నాయక్ గుగులోతు చిన్న లాకావత్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



## సియం రేవంత్ రెడ్డి వాగ్దానం ప్రకారం ఆశాలకు ఫిక్స్ వేతనం పద్దెనిమిది వేలు చెల్లించాలి

- ఏపిలో ఇస్తున్నట్లు లక్షా యాభై వేల గ్రాట్యుటీ,
- 62 ఏండ్ల వరకు పనిభద్రత,
- వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలి
- నాన్ హెల్త్ పనులు చేపించకూడదు
- టార్గెట్లు, టాస్క్ లు రద్దు చేయాలి
- సబ్ సెంటర్ డ్యూటీలు చేపించరాదు
- ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు)



**తెలుగు గళం న్యూస్**

శుక్రవారం ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ ధర్నాలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి మాట్లాడుతూ ఆశా వర్కర్లు గత 20 సంవత్సరాలుగా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. వీరికి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫిక్స్ వేతనం 18 వేల రూపాయలు ఇస్తానని వాగ్దానం చేశారన్నారు. రెండు సంవత్సరాలు గడుస్తున్న ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయడంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. ఒక వైపు ఆశాలకు అదనపు పని భారం మోపుతూ మరోవైపు వేతనాలు పెంచే విషయంలో ఇచ్చిన వాగ్దానం కూడా అమలు చేయకుండా దాటవేత ధోరణి అవలంబిస్తున్నారన్నారు. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఆశా వర్కర్లకు 62 ఏళ్ల వరకు పని భద్రత కల్పిస్తూ, రిటైర్మెంట్ తర్వాత లక్షా యాభై వేల గ్రాట్యుటీ ఇస్తూ, నూటా ఎనభై రోజుల(6 నెలలు) పాటు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇస్తున్నారన్నారు. మరి మన రాష్ట్రంలో కూడా అదే పని చేస్తున్న ఆశా వర్కర్లకు పై హామీలు ఎందుకు ఇవ్వడం లేదని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆశా వర్కర్లకు తాను ఇచ్చిన వాగ్దానం ప్రకారం 18 వేల రూపాయల ఫిక్స్ వేతనం ఇవ్వాలని, ఈఎస్ఐ,పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఏఎన్సి, పిఎన్సీ టార్గెట్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఓ) విజయలక్ష్మి గారికి సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అరూరి కుమార్ ఆశా వర్కర్స్ యూనియన్ కోశాధికారి సుజాత, ఉష, వజ్రక్క, పద్మ, సునీత, సుజాత, రజిత, మల్లీశ్వరి, రమ, సులోచన, రాజేశ్వరి, శోభ తదితరులు పాల్గొన్నారు.

## రజకులకు రక్షణ చట్టం చేయాలి

- కామారెడ్డి బీసీ డిక్లరేషన్ వృత్తి దారుల హామీలు అమలు చేయాలి
- రజక వృత్తి దారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైళ్ళ ఆశయ్య డిమాండ్



**తెలుగు గళం న్యూస్** జనగామ పూసల భవన్ నందు రజక వృత్తిదారుల సంఘం జనగామ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు మైలారం వెంకటేశ్వర్లు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశయ్య మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 80 వచ్చినా కూడా సేవా వృత్తిదారులైన రజకులు సామాజిక, ఆర్థిక, రాజకీయంగా తీవ్ర వెనుకపాడు తనం ఎదుర్కొంటున్నారని ఆశయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో రజక వృత్తిదారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వృత్తిదారులందరికీ 10 లక్షల వరకు ప్రభుత్వ సహకారం అందించి వృత్తి ఆధునికరణ ఉపాధి కల్పన అందిస్తామని ఇచ్చిన హామీని సంవత్సరం కావస్తున్న అమలు నోచుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మోడరన్ ధోబి ఘాట్లు డ్రై క్లినిక్ షాపులో ఏర్పాట్లకు వెంటనే రుణాలు అందించాలని, రజక ఫెడరేషన్ కు బడ్జెట్ కేటాయింపులు చేసి పాలకవర్గాన్ని నియమించాలని ఈ సందర్భంగా తెలిపారు. రజకులపై జరుగుతున్న సామాజిక దాడులు దౌర్జన్యాలు సాంఘిక బహిష్కరణ అరికట్టడానికి ప్రత్యేక రక్షణ చట్టం కల్పించాలని వారు కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే దిగిరావాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎ ఏదునూరి. మదార్ గారు మాట్లాడుతూ. 50 ఏళ్లు నిండిన రజక వృత్తిదారులకు వృద్ధాప్య పెన్షన్ పథకం ఏర్పాటు చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హత కలిగిన రజక వృత్తిదారులకు ఇండ్లు కేటాయించాలని కోరారు. రజక వృత్తిదారులకు మోపైడ్ వాహనాలు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో కొలిపాక నరసింహ సాంబరాజు దుర్గాప్రసాద్ చిట్యాల సమ్మయ్య మిలాపురం ఎల్లయ్య లోంక ఐలయ్య పోలాస పద్మాకర్ చల్లగురువుల పరుశరాములు రెడ్డి రాజుల రమేష్ చెన్నూరు పుల్లయ్య పొదల బిక్షపతి ఐలాపురం రామచంద్రయ్య ఐలాపురం బిక్షపతి ఎదునూరి బాల్ నరసయ్య కొత్త కొండ యాదగిరి ఉల్లెంగుల రాజు కొలిపాక మల్లయ్య కొలిపాక ఉపేందర్ పాల్గొన్నారు జిల్లా నాయకులు

## జనగామ పట్టణంలోని స్థానిక సమస్యలు పరిష్కరించాలి

**తెలుగు గళం న్యూస్** జనగామ పట్టణంలోని కలెక్టర్ ఆఫీస్ కు బస్టాండ్కు అతి చేరువలో ఉన్న మూడో వార్డు అన్ని సమస్యలకు నిలయంగా ఉన్నదని తక్షణ మూడో వార్డులో నెలకొన్న అంతర్గత రోడ్లు డ్రైనేజీ సమస్యలను తక్షణం పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ పింకేష్ కుమార్ కు సిపిఎం జనగామ జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి కలెక్టరేట్ కార్యాలయంలో మెమోరాండం

ఈసందర్భంగా వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ జనగామ పట్టణంలోని మూడో వార్డు లో మధ్యతరగతి ప్రజలు చిన్న వ్యాపారులు ఉద్యోగస్తులు నివసిస్తున్నారని వార్డ్ పైనుంచి పరిశీలిస్తే అత్యంత అభివృద్ధి చెందిన కాలనీలుగా పెద్దపెద్ద భవంతులు బిల్డింగులు ఉంటాయని అంతర్గతంగా లోపటికి వెళ్లి చూస్తే అంతర్గత రోడ్లు లేక తీవ్రమైన ఇబ్బందులు ఉంటాయని



తెలిపారు.బాలాజీ నగర్ జ్యోతి నగర్ ఎల్లమ్మ గుడి ఏరియా సెంట్ మేరీస్ స్కూలు ఏరియాలో కోటి రత్న ఆస్పటల్ వెనుక వైపు అంతర్గత సిసి రోడ్లు లేక వర్షాకాలం వస్తే వీధులన్నీ బురదమయంగా మారి చెరువుకుంటల మాదిరిగా ఉంటాయని ఆవేదన వ్యక్తం చేశారు.స్కూలుకు వెళ్లే పిల్లలు నడకదారిన వెళ్లే మహిళలు తీవ్రమైన అసౌకర్యానికి గురవుతున్నారుఅని వివరించారు.

కొన్నిచోట్ల ఎప్పుడో 15 సంవత్సరాల క్రితం వేసిన సిసి మోరీలు అన్ని కుంగిపోయి కూలినాయని దీనివల్ల డ్రైనేజీ వాటర్ మోరీలు నిండిపోయి దుర్గంధం దుర్వాసన దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ప్రజలు అనారోగ్యాల బారిన వాడే పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు.బాలాజీ నగర్ పిండి గిర్ని వద్ద మోడీ కల్వర్టు శిథిలమైపోయి వాహనాలు అందులో పడుతున్నాయని ప్రమాదకరంగా ఉన్నది కాబట్టి తక్షణం కొత్త సీసీ స్లాబు వెయ్యాలని అలాగే నూతనంగా నిర్మిస్తున్న పెద్ద డ్రైనేజీ పనులను వేగవంతం చేసి వరద నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం

## ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా

# జానపద జన జాతర

**2025, ఆగస్టు 23, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్.**

**తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో జానపద జాతర సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ లోని జాన పద కళలన్ని ఒక చోట చేర్చి జానపద జన జాతర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము. కావున ఆర్థిక మరియు అన్ని రకాల సహాకారాలనుఅందించాల్సిందిగా విజ్ఞాప్తి చేస్తున్నాము.**

జానపదమే తెలంగాణ ప్రాణపదం. పల్లెల్లో "పాట" నే ప్రాణంగా నేటికి బతికించుకుంటున్నారు. జానపదం సంస్కృతికి, బాషా సాహిత్యానికి పట్టుకొమ్మలు, సకల శాస్త్రాలకు మూలం, జానపద విజ్ఞానం.. మానవ నాగరికతా వికాసంలో వీటి పాత్ర అనన్య సామాన్యమైంది. మానవున్ని మాయ మవ్వకుండా కాపాడుకుంటూ వస్తున్న వెలుగు దివిటీలు మన కళాకారులు.

జాతి చరిత్రలు మసకబారకుండా పరిరక్షించుకుంటూ వస్తున్న కాంతి రేఖలు. ఇదంతా అల్లిక సాహిత్యం. ఒక తరం నుంచి మరో తరానికి వారసత్వంగా వస్తున్న జ్ఞాన సంపద.పల్లె వాసుల గుండె చప్పుడు, వేల వెలుగుల సింగిడి ఈ జానపదం. మరోసారి మన తెలంగాణలో కొత్త ఒరవడికి, సరికొత్త ఆశలు మోసు లేత్తేల ప్రజల జీవనాడిని జానపద కళాప్రదర్శనల ద్వారా మరోసారి వినిపిద్దాం!

తెలంగాణ బతుకులలోనే ఒక సహాజత్వం, శ్రమైక జీవన సౌందర్యానికి సకల కళలే ఒక అలంకారం, వారికి ఇదే జీవనాధారం కూడా అనేక అస్తిత్వాల పరివేదనను వినిపించే ప్రత్యామ్నాయ వేదికగా టిపిఎస్‌కె,మరుగున పడిన కళల చరిత్రను వెలికితీసే "ఆటపాటల అంగడి సకల కళల సింగిడి". అందుకే తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం(TPSK) ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా తెలం "గానాలు" జానపద జన జాతరలో ఆట పాటలతో ఘనంగా నిర్వహిస్తున్నది.

ఈ జాతరలో జానపదం, చిందు, యక్షగానం, బుర్రకథ, ఒగ్గుడోళ్లు,బేడబుడిగ జంగాల కథలు,బోనాలు, బతుకమ్మ, కోలాటాలు తదితర జానపద కళారూపాలతో దినమంతా సంబురం.

కావున ఆగస్టు 22న జానపద జన జాతరకు అన్ని రకాల సహాయ సహకారాలను అందించాల్సిందిగా విజ్ఞాప్తి చేస్తున్నాము.

భవదీయులు....

**జి.రాములు**
గౌరవ అధ్యక్షులు
9490098006

**భూపతి వెంకటేశ్వర్లు**
రాష్ట్ర అధ్యక్షులు
9490098343

**కె. హిమబిందు**
కార్యదర్శి
9490300200



